నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



భీమారంలో కేక్ కట్ చేస్తున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్



హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు



హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



ఖిలావరంగల్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

# వర్ధిల్లు వెయ్యేళ్లు..

**ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఘనంగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు**

- పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు
- కేక్‌లు కట్ చేసి, పటాకులు పేల్చి సంబురాలు
- అధినేత చిత్రపటాలకు పాలాభిషేకాలు



నర్సంపేటలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : గులాబీ దళపతి, తెలంగాణ రాష్ట్ర ప్రదాత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు కేక్‌లు కట్ చేసి, పటాకులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. దవాఖానాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. అలాగే హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కేక్ కట్ చేశారు. వరంగల్ నగరంలో తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కేక్ కట్ చేశారు. నర్సంపేట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేక్ కట్ చేసి, రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారంలో జరిగిన వేడుకల్లో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే రమేశ్ పాల్గొని కేక్ కట్ చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ పీహెచ్‌సీలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు రోగులకు పండ్లు పంపిణీ చేసి, ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలోని తన నివాసంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, డోర్నకల్‌లో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, ఇనుగుర్తిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గాయత్రీ గ్రూప్ అధినేత వద్దిరాజు కిషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పటాకులు పేల్చి కేసీఆర్ బర్త్ డే వేడుకలు జరుపుకున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు. కేసీఆర్ తన పుట్టిన రోజు కానుకగా ములుగును జిల్లాగా ఏర్పాటు చేశారని నాగజ్యోతి అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీ వైస్‌చైర్ పర్సన్ కళ్లెపు శోభారఘుపతి రావు, మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేటలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి కేక్ కట్ చేశారు. కడియం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య నేతృత్వంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో కేసీఆర్ బర్త్‌డే వేడుకలు నిర్వహించారు.

# ఇంటర్ తర్వాత ఏం చదవాలి?

- నేడు 'లక్ష్యం'-2024 పేరిట జనగామలో అవగాహన సదస్సు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ అధ్వర్యంలో నిర్వహణ



జనగామ, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ తర్వాత ఏ కోర్సులు చదవాలి..? ఎటు వైపు వెళ్లి జీవితంలో స్థిరపడి ఉత్తమ ఉద్యోగం చేయవచ్చు? అనే అంశంపై 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే', కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా 'లక్ష్యం'-2024 పేరుతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాల్ (సూర్యాపేట రోడ్డులోని సమీకృత కలెక్టరేట్ ఎదురుగా)లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా కేఎల్ యూనివర్సిటీ అధికారులు, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే బాధ్యులు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ఇంటర్ సెకండియర్ చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# మేడారంలో హలాల్ నిషేధం



పూజారి సిద్దబోయిన అరుణ్

ములుగు, ఫిబ్రవరి17 (నమస్తే తెలంగాణ) : ఆదివాసీల సంప్రదాయం ప్రకారం మేడారంలో హలాల్ నిషేధమని సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన అరుణ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మేడారం వచ్చే భక్తులు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మొక్కులు చెల్లించాలన్నారు. కోళ్లు, మేకలు, గొర్రెలను హలాల్ చేయడం ఆదివాసీల మనోభావాలకు విరుద్ధమన్నారు. ఇలా చేసే వారు జాతరకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించేందుకు ముర్దాల్ చేయాలని అరుణ్ సూచించారు.

# మేడారంలో కానిస్టేబుళ్ల చేతివాటం

**వాహనదారుడి నుంచి డబ్బులు వసూలు**

ములుగు, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : మేడారం మహా జాతర సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మొక్కులు చెల్లించుకునేందుకు ప్రైవేట్ వాహనాల్లో వస్తున్న భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. శనివారం స్తూపం వద్ద జరిగిన ఘటన ఇందుకు ఉదాహరణగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. నార్లాపూర్ గ్రామానికి చెందిన ఓ చిరు వ్యాపారి జాతర సందర్భంగా సొంత గ్రామంలో దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. తన దుకాణంలో విక్రయించేందుకు అవసరమైన సరుకులను మేడారం నుంచి తెచ్చుకునేందుకు కారులో వెళ్లాడు. స్తూపం వద్దకు చేరుకోగానే పోలీస్ ఉన్నతాధికారి ప్రవేశం లేదంటూ కారును ఆపివేశాడు. కారును పార్కింగ్ స్థలానికి పంపించి తాళం తీసుకురావాలని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించాడు. ఈ క్రమంలో సంబంధిత వ్యాపారితో కానిస్టేబుల్స్ బేరసారాలు ఆడి రూ.1000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వ్యాపారి రూ.500 ఉన్నాయని చెప్పి చేతికి ఇచ్చే క్రమంలో కానిస్టేబుల్ తన సెల్ పౌచ్‌లో పెట్టించుకొని కారు తాళం చెవి ఇచ్చాడు. ఈ విషయాన్ని ఓ వ్యక్తి అక్కడున్న సీఐకి తెలుపగా, స్పందించిన ఆయన విచారించి కానిస్టేబుళ్లపై ఆగ్రహం వ్యక్తం చేసి డబ్బులను తిరిగి ఇప్పించారు. స్థానికులకే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారుల నుంచి ఏ మేరకు వసూలు చేస్తున్నారో అని పలువురు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



జాతరలో ముచ్చటిస్తున్న నోడల్ అధికారులు

# విధుల్లో చేరిన నోడల్ అధికారులు

ములుగు, ఫిబ్రవరి17 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర కోసం ప్రభుత్వం నియమించిన ఐదుగురు నోడల్ అధికారులు శనివారం విధుల్లో చేరారు. ఆర్‌వీ కర్ణన్, ఎస్ కృష్ణ ఆదిత్య, ఆదర్శ్ సురభి, ప్రతిమాసింగ్, రాధికాగుప్తా మేడారానికి చేరుకున్నారు. ఈ మేరకు మంత్రి సీతక్క నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు పాల్గొన్నారు.

# పాపం.. పసివాళ్లు

**నీటి సంపులో పడి ఇద్దరు చిన్నారుల మృతి**

**మేడారం చూడకుండానే అనంతలోకాలకు..**

**వరంగల్ నగరంలో విషాదఛాయలు**

**కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు**



శౌరితేజ, తేజస్విని (ఫైల్)

వారు ఎంతో దూరం నుంచి బయలుదేరారు. వనదేవతల దీవెనలు పొందాలని కోటి ఆశలతో తమ పిల్లలను తీసుకొని వ్యవప్రయాసాలకోర్చి వరంగల్‌కు చేరుకున్నారు. తెల్లవారితే తల్లుల చెంతకు చేరే క్రమంలో ఆ పిల్లలిద్దరూ విగత జీవులయ్యారు. ఈ హృదయవిదారక ఘటన వరంగల్ నగరంలో జరిగింది.
-కాశీబుగ్గ, ఫిబ్రవరి 17

నీటి సంపులో పడి ఇద్దరు పిల్లలు మృతి చెందిన ఘటన వరంగల్ 14వ డివిజన్ బాలాజీనగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన మరికల రమ, శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు భలేశ్వరిని వికారాబాద్ జిల్లా తాండురుకు చెందిన కరణం రవికుమార్‌కు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించారు. రవికుమార్ తాండూరులో పూజారిగా పని చేస్తున్నాడు. వీరికి శౌరితేజ(3), తేజస్విని(2) ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేడారం జాతర సందర్భం గా రవికుమార్-భలేశ్వరి దంపతులు తమ పిల్లలను తీసుకొని శుక్రవారం రాత్రి బాలాజీనగర్‌లోని తమ తల్లిగారింటికి వచ్చారు. శనివారం మేడారం జాతరకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. అయితే, చాలా దూరం నుంచి ప్రయాణం చేయడంతో అలిసిపోయిన వారు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రించారు. కొంత సమయం తర్వాత రవికుమార్, భలేశ్వరి నిద్రలేచి చూడగా పిల్లలు కనిపించలేదు. వెంటనే వారు ఇంటి చుట్టూ వెతికారు. చివరకు నీటి సంపులో చూడగా ఇద్దరు పిల్లలు విగత జీవులుగా కనిపించారు. వెంటనే వారిని కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వారి రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారుల మృతితో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు కంటతడి పెట్టారు. కాగా, తల్లిదండ్రులు ఆదమరిచి నిద్రించడంతో పిల్లలు ఆడుకుంటూ వెళ్లి నీటిసంపులో పడి మృతి చెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎనుమాముల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పైసా ఖర్చు లేకుండా దర్శనం

**అధికారులు భక్తులతో మర్యాదగా వ్యవహరించాలి**

**మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం**

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం సమ్మక్క-సారలమ్మల గిరిజన జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు పైసా ఖర్చు లేకుండా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం మంత్రి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ శబరీష్, నోడల్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించడంతో పాటు మేడారంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్, 40 బైక్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఐఅండ్‌పీఆర్ ద్వారా రూపొందించిన పుస్తకాన్ని, మీడియా టీషర్టులను ఆవిష్కరించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ మేడారానికి వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. అధికారులు భక్తులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. జాతర కీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలలా తెలిసేలా మీడియా కవరేజ్ ఇవ్వాలని మంత్రి కోరారు. భక్తుల కోసం రూట్ మ్యాప్‌లతో ఉన్న వీడియోను విడుదల చేసినట్లు తెలిపారు. భక్తులకు తాగునీటి కొరత లేకుండా చూడాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో నోడల్ అధికారులు కృష్ణ ఆదిత్య, కర్ణన్, ప్రతిమాసింగ్, రాధికాగుప్తా, అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీవో అంకిత్, ఏఎస్పీ సంకీర్త్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఐఅండ్‌పీఆర్ ఏడీ లక్ష్మణ్, డీపీఆర్వో రఫీక్, ఏపీఆర్వో వేణు, ఆర్టీసీ ఆర్ఎం ఎం శ్రీలత, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ అధికారులకు సహకరించాలి**

జాతరకు బస్సుల్లో వచ్చే భక్తులు ఆర్టీసీ అధికారులకు సహకరించాలని మంత్రి సీతక్క కోరారు. మేడారంలో ఆర్టీసీ బేస్ క్యాంపును శనివారం రాత్రి ఆమె ప్రారంభించారు. బేస్ క్యాంపులో ఏడు కిలో మీటర్ల మేర 50 క్యూలైన్లను నిర్మించామన్నారు. భక్తులను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చేందుకు 6 వేల బస్సులను 25వ తేదీ వరకు నడుపనున్నట్లు తెలిపారు. 15 వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ రఘునాథరావు, ఆర్ఎం శ్రీలత, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

# గ్రూప్-4లో తక్కువ మార్కులు వచ్చాయని..

**పెద్దముప్పారం యువతి ఆత్మహత్య**




గదరబోయిన శిరీష(ఫైల్)

దంతాలపల్లి, ఫిబ్రవరి 17: గ్రూపు-4 పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురై ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన గదరబోయిన బక్కయ్య, భిక్షమమ్మ దంపతులకు కుమారులు అశోక్, అనిల్, కూతురు గదరబోయిన శిరీష (24) ఉన్నారు. శిరీష తొర్రూర్‌లో డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్ హాస్టల్‌లో ఉంటూ గ్రూపు-4 పరీక్షలకు ప్రిపేరై పరీక్షలు రాసింది. ఇటీవల ఫలితాలు విడుదల కావడంతో తనకు అనుకున్న దానికంటే తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

# భార్య చేతిలో భర్త హతం

- మద్యానికి బానిసై వేధిస్తుండడంతో హత్య
- పోలీస్‌స్టేషన్‌లో లొంగుబాటు



హత్యకు గురైన రాజు

నర్సంపేట, ఫిబ్రవరి 17: నిత్యం తాగొచ్చి వేధిస్తున్నాడు. ఎంత చెప్పినా తన బుద్ధి మారడం లేదు. దీంతో విసిగారేసిన ఓ భార్య తన భర్తను హత్య చేసిన ఘటన దుగ్గొండి మండలంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామానికి చెందిన జరిపోతుల రాజు(48) మద్యానికి బానిసై నిత్యం భార్యతోపాటు కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. మద్యం అలవాటును మానుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నా రాజు వినడం లేదు. శుక్రవారం రాత్రి కూడా రాజు మద్యం తాగొచ్చి భార్య లక్ష్మిని వేధించాడు. కోపోద్రిక్తురాలైన ఆమె సిమెంట్ ఇటుకతో రాజును కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత ఆమె పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నర్సంపేట రూరల్ సీఐ శ్రీనివాస్, దుగ్గొండి ఎస్సై పరమేశ్ నిందితురాలితోపాటు కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు. శవ పంచనామా చేసి, పోస్టుమార్టానికి పంపించారు.



రాళ్లు తీసివేయడంతో చదునుగా కనిపిస్తున్న ప్రభుత్వ భూమి

# కబ్జాపై కదిలిన అధికారులు

**ప్రభుత్వ భూమిలో పాతిన రాళ్ల తొలగింపు**

**'నమస్తే' కథనానికి స్పందన**

గణపురం, ఫిబ్రవరి 17 : ప్రభుత్వ భూమి కబ్జాపై గణపురం రెవెన్యూ అధికారులు కదిలారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాతిన రాళ్లను తొలగించారు. మండలంలోని గాంధీనగర్-మైలారం గ్రామాల మధ్య 204 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా చేసి గుంటకు రూ.14 లక్షల వరకు విక్రయిస్తున్న విషయమై శనివారం 'దర్జాగా కబ్జా' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్ఐ రహీంపాషా ఆధ్వర్యంలో ట్రాక్టర్ డోజర్‌తో పాతిన రాళ్లను తీసేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా అమ్మినా, కొన్నా నేరమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సరైన విచారణ చేయకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోతారని ఆర్ఐ తెలిపారు.

# వరంగల్ డీటీసీగా శ్రీనివాస్

**రవాణాశాఖలో భారీగా బదిలీలు**

వరంగల్, ఫిబ్రవరి 17 : హనుమకొండ ఆర్టీఏలో భారీగా బదిలీలు జరిగాయి. డీటీసీతో పాటు ఎంవీఐలు బదిలీ అయ్యారు. వరంగల్ డీటీసీగా పనిచేస్తున్న పురుషోత్తంను కరీంనగర్ డీటీసీగా బదిలీ చేశారు. ఆదిలాబాద్ డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌కు వరంగల్ డీటీసీగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, హనుమకొండ ఆర్టీఏలోని సీనియర్ ఎంవీఐ కంచె వేణును హుజూరాబాద్, శ్రీనివాస్‌ను వరంగల్‌కు బదిలీ చేశారు. ఏఎంవీఐలు స్రవంతి కరీంనగర్, ఫైమా, మాధవి ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. వరంగల్‌లో పనిచేస్తున్న రమేశ్‌రాథోడ్‌ను హనుమకొండ ఎంవీఐగా బదిలీ చేశారు. మరో ఇద్దరు ఎంవీఐలు వేణుగోపాల్, కిశోర్ బాబు హనుమకొండకు రానున్నారు.

**వరంగల్ ఆర్టీఏలో..**

ఖిలావరంగల్ : వరంగల్ ఆర్టీఏలో ఉద్యోగులను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీవో రంగారావు పెద్దపల్లి జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కుమ్రంభీం ఆసీఫాబాద్ జిల్లా నుంచి జీ లక్ష్మి వచ్చారు. అలాగే, ఎంవీఐలు కోల రవీందర్ ఆదిలాబాద్‌కు, ఏఎంవీఐ శాలిని ఆసీఫాబాద్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

